ఆదర్శం.. ఈ ఉపాధ్యాయులు

ఓ వ్యక్తి అభివృద్ధిలో తల్లిదండ్రులతోపాటు గురువులే కీలకపాత్ర పోషిస్తారు. విద్యాబుద్ధులు నేర్పిస్తూ సన్మార్గంలో నడిచేలా తీర్చిదిద్దుతారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల వెన్నుతట్టి వారి ఉన్నత భవిష్యత్ నిర్మాణంలో చేయూతనందిస్తారు. చదువుతోపాటు క్రీడల్లోనూ నేటి బాలలను రేపటి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులెందరో మన మధ్య ఉన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కొందరు ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం.


బైంసాటౌన్: బోనాల పండుగ గురించి బోధిస్తున్న ఉపాధ్యాయురాలు రాధిక (ఫైల్)

గుర్తుండిపోయేలా బోధన..!

భైంసాటౌన్: వినూత్న బోధనా పద్ధతులను అవలంభిస్తూ విద్యార్థులకు పాఠాలు గుర్తుండిపోయేలా బోధిస్తున్నారు భైంసా మండలంలోని వాలేగాం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు దొంతుల రాధిక. బోధనకు అవసరమైన చిత్రపటాలు సేకరించి బోర్డుపై చిత్రాలు గీస్తూ బోధిస్తున్నారు. ప్రయోగాత్మక విద్యకు పెద్దపీట వేస్తూ మన సంప్రదాయాలను విద్యార్థులకు వివరిస్తున్నారు. క్షేత్ర పర్యటనలతో పుస్తకాల్లోని పాఠ్యాంశాలను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటున్నారని ఈ ఉపాధ్యాయురాలు చెబుతున్నారు.

గణితంపై ఆసక్తి పెంచుతూ..


ఎ. గంగాధర్

తానూరు: గణితమంటే విద్యార్థుల్లో ఉన్న భ యం పోగొట్టి ఆసక్తి పెంచుతున్నాడు మండలంలోని భోసి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎ.గంగాధర్. సులభంగా కాన్సెప్టులు బోధిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నాడు. ఉత్తమ సేవలకు గాను ప్రభుత్వం నుంచి 2024లో అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు.

విద్యార్థులను ప్రోత్సహిస్తూ..


జాడి శ్రీనివాస్

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన గణిత ఉపాధ్యాయుడు జాడి శ్రీనివాస్ విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారు చదువులో రాణించేలా చూస్తున్నాడు. ఏడేళ్లుగా సబ్జెక్టుల బోధనతో పాటు ఎన్‌ఎంఎంఎస్ ఎంపిక కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాడు. కడెం మండలం లింగాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో 9 ఏళ్లు, మస్కాపూర్‌లో ఏడేళ్లుగా పనిచేస్తూ విద్యార్థులు ఎన్‌ఎంఎస్‌కు, బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యేలా సానబెడుతున్నాడు. ఈయన కృషి కారణంగానే లింగాపూర్‌లో 69 మంది, మస్కాపూర్‌లో 116 మంది ఎన్‌ఎంఎంఎస్ కు ఎంపికయ్యారు. 2020లో జిల్లా స్థాయి, 2022లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నాడు. ఎన్‌ఎంఎంఎస్ విషయమై 2024లో టీశాట్ లైవ్ ప్రోగ్రాంలో పాల్గొని విద్యార్థులకు సూచనలు చేశాడు. ఈనెలలో న్యూఢిల్లీలో ఎన్‌ఈపీ -20 20పై నిర్వహించే జాతీయస్థాయి శిక్షణలో తెలంగాణ నుంచి పాల్గొనే 10 మంది ఉపాధ్యాయుల్లో ఈయన ఒకరు.

క్రీడాకారులను తయారు చేస్తూ..


శ్రీనివాస్

లక్ష్మణచాంద: గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీస్తూ వారిని నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ శ్రీనివాస్. చదువుతోపాటు క్రీడల ప్రాధాన్యతను వివరిస్తూ మైదానంలో గడిపేలా చూస్తున్నాడు. ఈయన 2018లో వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 20 మంది వివిధ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. గతేడాది అండర్-14 విభాగంలో రాథోడ్ అశిష్ అనే పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. అండర్-14లోనే కీర్తన, విక్రమ్ ఖోఖోలో రాష్ట్ర స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్, అండర్-14లో బేస్ బాల్‌లో రాథోడ్ కరణ్ సిల్వర్ మెడల్ సాధించారు.

కోలాహలంగా నిమజ్జనం


లక్ష్మణచాంద: కనకాపూర్‌లో చెరువు వద్ద పూజలు చేస్తున్న సభ్యులు


లోకేశ్వరం: మన్మద్‌లో భజనలు చేస్తూ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న భక్తులు


కుంటాలలో భజన చేస్తూ వినాయకుడి శోభాయాత్ర నిర్వహిస్తున్న యువకులు


తానూరులో శోభాయాత్రగా వెళ్తూ..


కడెం: బెల్లాల్‌లో నిమజ్జనానికి వెళ్తున్న భక్తులు


కుభీర్: పార్డి(బి)లో శోభాయాత్ర

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండపాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వాహకులు వీధుల్లో వినాయకుడి శోభాయాత్ర నిర్వహించి ప్రతిమలను సమీపంలోని చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. – సాక్షి నెట్‌వర్క్

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

ఖానాపూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు దృష్టి సారించాలని తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రత్నాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని బీర్నంది, గోసంపల్లి పంచాయతీ కార్యాలయాల్లో ఆయా గ్రామాల పరిధి కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఇళ్లు నిర్మించుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుందని పేర్కొన్నారు. సభ్యులు ఉన్నారు.

కడెం మండలంలో..

కడెం: మండలకేంద్రంతోపాటు మండలంలోని లింగాపూర్, నవాబ్‌పేట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాల స్థితి, బిల్లులు తదితర అంశాలు చర్చించారు. ఇందులో ఎంపీడీవో అరుణ, ఎంపీవో కవిరాజు, ఏపీఎం గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, నాయకులు తదితరులున్నారు.


బీర్నందిలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుజాత

దస్తురాబాద్ మండలంలో..

దస్తురాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని తహసీల్దార్ విశ్వంబర్, ఎంపీడీవో సుజాత సూచించారు. మండలంలోని గ్రామాల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో రమేశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, హౌజింగ్ ఏఈ వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం పక్కనే ఇందిరమ్మ మోడల్ హౌస్‌లో నూతనంగా ప్రారంభమైన ఆధార్ కేంద్రాన్ని పట్టణ, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రత్నాకర్‌రావు అన్నారు. గురువారం ఆధార్ కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేష్, నాయకులు లక్ష్మీపతి గౌడ్, చరణ్, కుతుబ్బుద్దీన్, హౌసింగ్ ఏఈ ఖయ్యూమ్, తదితరులు ఉన్నారు.

నోట్‌బుక్‌లు పంపిణీ

దస్తురాబాద్: వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం హిందూ వారియర్స్ యూత్ ఆధ్వర్యంలో నోట్‌బుక్‌లు అందజేశారు. ఎంపీడీవో సుజాత, తహసీల్దార్ విశ్వంభర్, ఎంపీవో రమేశ్‌రెడ్డి, హెచ్‌ఎం వేణు, ఉపాధ్యాయులు, యూత్ సభ్యులు ఉన్నారు.

మస్కాపూర్‌లో..

ఖానాపూర్: ప్రతీ విద్యార్థి రెగ్యులర్‌గా పాఠశాలకు వచ్చి చదువులో రాణించాలని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం నరేందర్‌రావు అన్నారు. గురువారం మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. గైర్హాజరు లేకుండా హాజరైన విద్యార్థులను అభినందించి పెన్నులు, నోట్‌బుక్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం


కడెం: లింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..


లోకేశ్వరం: కిష్టాపూర్ పాఠశాలలో..


ఖానాపూర్‌లో ఉపాధ్యాయురాలిగా మారి పాఠాలు బోధిస్తున్న విద్యార్థిని

జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
– సాక్షి నెట్‌వర్క్

హాజరు పెంచాలి

కుభీర్: విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరవకుండా హాజరు శాతం పెంచాలని కుభీర్ గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల అన్నారు. గురువారం పాఠశాలలో భోజనం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని పేర్కొన్నారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి 'ఉపాధి' గ్రామసభలు

లోకేశ్వరం: మండలంలోని గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలను ఈనెల 5వ తేదీ నుంచి 11 వరకు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సోలమాన్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. 5న కిష్టాపూర్‌లో, 6న బిలోలి, పోట్‌పల్లి, మన్మద్, పంచగుడి, జోహర్‌పూర్, వట్టోలి, 7న రాయపూర్‌కాండ్లీ, పిప్రి, గడ్‌చాంద గ్రామాల్లో, 8న రాజూర, 9న నగర్, హవర్గా, పుస్పూర్, భాగాపూర్, 10న హథ్గాం, 11న లోకేశ్వరం, అబ్దుల్లాపూర్, సాథ్గాం, ధర్మోర, గొడిసెరా, కన్కపూర్, బామ్ని(కే), నర్సింహనగర్, సేవాలాల్‌తండా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సభలకు ఉపాధి కూలీలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అనంతరం ఈనెల 12 లోకేశ్వరంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తామని.. ఆయా గ్రామాల్లోని కూలీలు, నాయకులు విధిగా హాజరు కావాలని కోరారు.

ప్రశాంతంగా నిమజ్జనం నిర్వహించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: వినాయక నిమజ్జన శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం నిర్మల్ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేశుని మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి మెమొంటో అందజేశారు. అనంతరం రాధాకృష్ణ మందిరంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జనం సజావుగా సాగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, తహసీల్దార్ రాజు సిబ్బంది పాల్గొన్నారు.


భాగ్యనగర్‌లో మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

గణపయ్యా.. పూజలందుకోవయ్యా


లోకేశ్వరం: అబ్దుల్లాపూర్‌లో పూజలు చేస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్


దస్తురాబాద్ : రాంపూర్‌లో..

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్‌లో మోక్ష కర్ర గణపతిని గురువారం ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మోక్ష గణపతి మండపం కోసం నిధుల మంజూరుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. బీజేపీ మండల కన్వీనర్ సాయన్న, మహేందర్‌రెడ్డి, భోజన్న, జయసాగర్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.అబ్దుల్లాపూర్‌లో కర్ర మోక్ష గణనాథుడిని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి భార్య కవిత రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం ఆమెను గ్రామస్తులు సన్మానించారు.

గణనాథుడికి నైవేద్యాలు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బేస్తవార్‌పేట్ కాలనీలో కొలువుదీరిన హిమాలయ గణేశుడికి బుధవారం రాత్రి 55 రకాల నైవేద్యాలను సమర్పించారు. అంతకుముందు కాలనీవాసులు ప్రత్యేక పూజలు చేశారు.


55 రకాల నైవేద్యాలతో భక్తులు

దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్, రాంపూర్ గ్రామాల్లో కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున వచ్చి పూజల్లో పాల్గొన్నారు.

రోడ్డుకు 'వీడీసీ' మరమ్మతులు

లోకేశ్వరం: ఇటీవల భారీవర్షాలకు మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామ సమీపంలో భైంసా రోడ్డు నుంచి పోస్టాఫీసు వరకు రోడ్డు కొట్టుపోయి గుంతలు ఏర్పడాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో గురువారం రాయపూర్ కాండ్లీ వీడీసీ సభ్యులు రూ.45 వేలతో మొరం పోయించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.


లోకేశ్వరం: మొరం చదును చేయిస్తున్న సభ్యులు

అందకూర్‌లో గుంతలు పూడ్చిన రైతు

కుంటాల: మండలంలోని కల్లూరు–కుంటాల డబుల్ రోడ్డు అందకూర్‌లో గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. దీంతో గ్రామానికి చెందిన కన్నం లక్ష్మణ్ అనే రైతు గురువారం తన పంట చేను వద్ద ప్రమాదాలు జరగకుండా గుంతలు పూడ్చి శ్రమదానం చేశాడు.

మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కృషి

నిర్మల్: నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్(జి) మండలంలోని కుస్లీ గ్రామం నుంచి ప్రేమ్‌నగర్ తండా వరకు రూ.1 కోటి 20 లక్షలతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం వర్షాలతో దెబ్బతిన్న పంటలు, రోడ్లను పరిశీలించారు. సర్వే చేసి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్మల్ మాజీ ఎంపీపీ వి.సత్యనారాయణ గౌడ్, మండలాధ్యక్షుడు బర్కుంట నరేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దిలావర్‌పూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సాంగ్విలో రూ.3కోట్లతో సీసీ రోడ్లు, సిర్గాపూర్‌లో రూ.35 లక్షలతో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, బన్సపల్లిలోని ఎస్సీ కాలనీలో రూ.35 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, మాజీ జెడ్పీటీసీలు తక్కల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం దిలావర్‌పూర్‌లో అనారోగ్యంతో మరణించిన ఎనుగంటి ముత్తవ్వ, కుంట చిన్నయ్య కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు.


కుస్లీలో పనులకు శంకుస్థాపన చేస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిమజ్జనానికి రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

సారంగాపూర్: మండలంలోని జామ్‌లో ఈనెల 8న నిర్వహించే గణేశుడి నిమజ్జన కార్యక్రమానికి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని గ్రామ హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. నిర్మల్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. కమిటీ సభ్యులు విలాస్, రాము, వినయ్, దాసరి ప్రశాంత్, నవీన్ తదితరులు ఉన్నారు.

'ఆది కర్మయోగి'ని గిరిజనుల వద్దకు చేర్చాలి

మామడ: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమాన్ని గిరిజనుల వద్దకు చేర్చాలని ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి అన్నారు. గురువారం మామడ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి క్షేత్రస్థాయి ఉద్యోగులు, స్వ యం సహాయక సంఘాలు, యువకులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కృషి చేయాలని పేర్కొన్నా రు. కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలకేంద్రంలోని రైతువేదికలో గురువారం ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌రావు అధికారులకు ఆదికర్మ యోగి అభియాన్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంఘాల్లో నాయకత్వం పెంచడం, సంక్షేమ పథకాల అమలు మెరుగుపరచడం, వికేంద్రీకృత పాలనను నిర్మించడం ఈపథకం ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ అజీజ్‌ఖాన్, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.


మామడలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి

క్లుప్తంగా

పలువురిపై కేసు

ముధోల్: మండలకేంద్రంలో ఈనెల 2న గణేశుడి నిమజ్జనోత్సవంలో నిబంధనలు ఉల్లంఘించిన పలువురు మండపాల నిర్వాహకులు, డీజే ఆపరేటర్లపై కేసులు నమోదు చేసినట్లు గురువారం ఎస్సై బిట్లా పెర్సిస్ ఓ ప్రకటనలో తెలిపారు. నిమజ్జన శోభాయాత్రలో సాయంత్రం 5 నుంచి తెల్లవారుజాము వ రకు ప్రజలకు ఇబ్బంది కలిగించినందుకు కే సులు నమోదు చేశామని పేర్కొన్నారు.

లక్కీ డ్రాలో ముస్లింకు లడ్డూ


హుస్సేన్‌కు లడ్డూ అందిస్తున్న సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామంలో రాక్స్ యూత్ ఆధ్వర్యంలో గణేశుడి ప్రతిమ ఏర్పాటు చేశారు. నిమజ్జనం సందర్భంగా యూత్ సభ్యులు లడ్డూ కోసం లక్కీ డ్రా నిర్వహించగా గ్రామానికే చెందిన సయ్యద్ హుస్సేన్ పేరు వచ్చింది. దీంతో లడ్డూను ఆయనకు అందించారు.

'గిరి' గ్రామాలకు రూ.4.45 కోట్లు మంజూరు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు రూ.4కోట్ల 45 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సారంగాపూర్ మండలం దుప్య తండా నుంచి బండ్రేవ్ తండా వరకు రూ.1కోటి 15 లక్షలు, మామడ మండలం కిషన్‌రావుపేట్ నుంచి జైరామ్ తండా వరకు రూ.80 లక్షలు, మేడిపల్లి నుంచి శాంతినగర్ తండా వరకు రూ. 2 కోట్లు, లక్ష్మణచాంద మండలం పార్పెల్లి గ్రామం నుంచి పార్పెల్లితండా వరకు రూ.50 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

'జీఎస్టీ తగ్గింపుతో లాభం'

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తుందని.. తాజాగా జీఎస్టీ స్లాబ్‌ల తగ్గింపు నిర్ణయం పేద, మధ్యతరగతి కుటుంబాలకు నేరుగా లాభం చేకూరుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దినసరి వస్తువుల ధరలు తగ్గడం వలన పేదల జీవనవ్యయం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్కరణలతో వ్యవసాయ యంత్ర పరికరాలపై జీఎస్టీ 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు.

డీఈఓకు సన్మానం

నిర్మల్: జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన దర్శనం భోజన్నను తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఇందులో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బాస్, పట్టణాధ్యక్షుడు అయ్యన్నగారి శ్రీధర్, కార్యదర్శి శ్యామ్, సభ్యులు ఎల్లయ్య, జయరాజ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాధవికి 'గురుబ్రహ్మ' అవార్డు


పురస్కారం అందుకుంటున్న మాధవి

నిర్మల్: జిల్లాకేంద్రంలోని వశిష్ట హైస్కూల్ హెచ్‌ఎం గొల్లపల్లి మాధవి 'గురుబ్రహ్మ పురస్కారం' అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో గురువారం శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ వారు ఈ అవార్డు అందించారు. పాతికేళ్లుగా విద్యారంగంలో చేస్తున్న కృషికి పురస్కారం అందించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ అవార్డు రావడంపై మాధవి, చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అంత్యక్రియలకు సాయం

ముధోల్: మండలకేంద్రంలోని కోట్‌గల్లీకి చెందిన రాజేశ్వర్ మృతి చెందగా.. ఆయన అంత్యక్రియలకు బాల్యమిత్రులు ఆర్థికసాయం అందించారు. 2005–06లో రాజేశ్వర్‌తో పదో తరగతి చదివిన మిత్రులు రూ.11వేలను జమ చేసి గురువారం బాధిత కుటుంబీకులకు అందించారు.

హెచ్‌ఎంలతో సమావేశం

లక్ష్మణచాంద: స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయ రేటింగ్‌కు పాఠశాలల హెచ్‌ఎంలు ఆన్‌లైన్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలని ఎంఈవో అశోక్ వర్మ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీరు, మరుగుదొడ్లు, హ్యాండ్ వాషింగ్–సోప్, బిహేవియరల్ చేంజ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్, ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్, మిషన్ లైఫ్ ఆక్టివిటీస్ విభాగాల్లో బహుమతుల ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్ శంకర్, రాజశేఖర్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.